క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన



ఎమ్మిగనూరు 18వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

ఎమ్మిగనూరుటౌన్: ఐదేళ్లుగా నిర్విఘ్నంగా పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని, అలాగే తన తల్లి బుట్టా రేణుకను ఎమ్మెల్యేగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతుల్ విన్నవించారు. ఆయన బుధవారం పట్టణంలోని 18వ వార్డు పరిధిలో కౌన్సిలర్ రంగమ్మ, ఇన్‌చార్జ్ సోమేష్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి యోగక్షేమాలను తెలుసుకుంటూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. టీడీపీ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సంక్షేమ సారథి వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, కో–ఆప్షన్ మెంబర్ అబ్రార్, మున్సిపల్ కౌన్సిలర్లు కేశవరెడ్డి, నీలకంఠ, చంద్రశేఖర్, లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు



నాయకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి కోరారు. ఆయన బుధవారం సర్కిల్ కార్యాలయం ఆవరణలో వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఏమైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేరచరిత్ర కలిగిన వారిని ముందుజాగ్రత్తగా బైండోవర్ చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎవరి పార్టీకి వారు ప్రశాంతంగా ఎన్నికల ప్రచారం చేసుకోవచ్చని, అందరూ కలసిమెలసి ఉండాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

54 మంది వలంటీర్ల రాజీనామా



ఏఓకు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

మద్దికెర: మండలంలోని పెరవలి, మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాలకు చెందిన 54 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి రాజీనామా పత్రాలను పరిపాలనాధికారి సువర్ణలతకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందించామన్నారు. ప్రతిపక్ష పార్టీలు తమకు రాజకీయాలు అంటగట్టడం బాధాకరమన్నారు. పలు మార్లు బహిరంగ సభల్లో వలంటీర్లపై నిందలు వేసినా భరించామని, ఎన్నికల సమయంలో ప్రజలకు సేవలు నిలిపివేయాలని ప్రతిపక్ష పార్టీలు కోర్టు ద్వారా కోరడంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నామన్నారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. రాజీనామాల విషయాన్ని జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు.

కృష్ణగిరి: చిట్యాల గ్రామానికి చెందిన 12 మంది,లక్కసాగరం గ్రామానికి చెందిన ఇద్దరు వలంటీర్లు విధులకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను బుధవారం ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌కు అందజేశారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం రత్నపల్లె సచివాలయం పరిధిలోని బోయనపల్లె గ్రామ వలంటీర్లు 10 మంది బుధవారం విధులకు రాజీనామా చేస్తూ పత్రాలను ఎంపీడీఓ శివశంకరప్పకు సమర్పించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

తుగ్గలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని శభాష్‌పురం, రాంపల్లి, పెండేకల్లు, డీసీ కొండ, జీజీరాల్ల, ఎద్దులదొడ్డి కోతికొండ, మామిళ్లకుంట, పెండేకల్లు రైల్వే జంక్షన్ పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆర్డీఓ రామలక్ష్మి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ర్యాంపు తదితర వసతులను పరిశీలించారు. అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ షర్మిల, ఆర్‌ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు వెంట ఉన్నారు.

పరిమితికి మించి ప్రయాణికుల తరలింపుపై చర్యలు

మద్దికెర: పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలను సీజ్ చేసి ఆర్టీఓకు అప్పగించగా అపరాధ రుసుం విధించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు బుధవారం తెలిపారు. గ్రామంలో అధికంగా ప్రయాణికులను తరలిస్తూ వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నందున చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఒక ఆటోకు రూ.11,500 మరో ఆటోకు వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు. ఇక నుంచి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎమ్మిగనూరు సచివాలయం వద్ద ఎండలో వేచిఉన్న వృద్ధులు



గోనెగండ్ల సచివాలయంలో...





ఉప్పరహళ్లిలో గోడ నీడలో పడిగాపులు, గుడేకల్‌లో కర్రసాయంతో వస్తున్న బోయ మల్లమ్మ

‘సొమ్ము’సిల్లిపోతున్న పండుటాకులు

- పింఛన్ల కోసం మండుటెండలో నిరీక్షణ
- సచివాలయాల వద్ద పడిగాపులు
- టీడీపీ కుతంత్రంతో ఇంటి వద్ద అందని పింఛన్లు
- చంద్రబాబుకు ఉసురు తప్పదంటున్న వృద్ధులు, వితంతువులు



హులేబీడు ఆర్బీకేలో పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు



ఆస్పరి సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు



గోనెగండ్లలో పింఛన్ కోసం అవస్థలు పడుతూ వస్తున్న వృద్ధురాలు

తుగ్గలి: ప్రతి నెలా 1వ తేదీ సూరీడు రాక ముందే వచ్చి పలకరించే వలంటీర్లతో శుభోదయం అయ్యేది. వేకువజామునే పింఛన్ సొమ్ము చేతికందడంతో అవ్వాతాతలు, దివ్యాంగుల కళ్లలో ఆనందం వెల్లివిరిసేది. మంచానికి పరిమితమైన రోగుల కళ్లు చెమ్మగిల్లేవి. నెలకు రూ.3వేలు ఇంటికే రావడంతో కొండంత ఆర్థిక భరోసాగా భావించేవారు. అయితే ఎన్నికల బూచి చూపి ఇంటి వద్దకే వచ్చే పింఛన్ సొమ్మును టీడీపీ అడ్డుకుంది. గతంలో వలే ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి ఎండలో వేచి ఉండాల్సిన పరిస్థితి కల్పించిందని అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుట్రతో తమ పొట్టకొట్టారని మండిపడుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నీచ బుద్ధి బయటపడిందని ఛీదరించుకుంటున్నారు. ఐదేళ్ల పాటు ఇబ్బంది లేకుండా వచ్చిన పింఛన్ రేపు టీడీపీ అధికారంలో వస్తే అసలు ఇస్తారా ? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ పంపిణీ చేస్తామని చెప్పడంతో బుధవారం మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల వద్దకు వచ్చిన అవ్వతాతలు, వింతతువులు, దివ్యాంగులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొందరు వేచి చూడలేక ఇళ్లకు వెళ్లిపోయారు. సాయంత్రం 4గంటల తర్వాత పంపిణీ ప్రారంభమైంది.

పాతరోజులు గుర్తుకొచ్చేలా చేశారు.

ఆలూరు రూరల్: ఇంటి వద్దే చేతికందుతున్న పింఛన్ సొమ్ము చూసి మురిసిపోయిన అవ్వాతాతలకు మళ్లీ పాతరోజులు గుర్తుకొచ్చాయి. బుధవారం ఉదయం నుంచే మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద వృద్ధులు, వితంతువులు పడిగాపులు గాస్తూ నిరీక్షించారు. మండుటెండలో ఉక్కపోతకు నీరసించి సొమ్మసిల్లిపోతున్నారు. సాయంత్రం పింఛన్ల పంపిణీ ప్రారంభించినా.. పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేకపోయారు. మండలంలో 9 వేలకుపైగా లబ్ధిదారులుండగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 10 శాతం పంపిణీ మాత్రమే జరిగింది. గతంలో వలంటీర్ల ద్వారా తెల్లారేసరికల్లా 90 శాతం పంపిణీ పూర్తయ్యేదని పింఛన్‌దారులు చెబుతున్నారు.

పండుటాకులపై పగ ఎందుకు

గోనెగండ్ల: ఇంటి వద్ద పింఛన్ అందుకుంటూ మురిసిపోతున్న అవ్వాతాతలను చూసి టీడీపీ అధినేత చంద్రబాబు కన్నెర్రజేశారు. ఎన్నికల కోడ్‌ను అడ్డుపెట్టుకొని అక్కసును వెళ్లగక్కారు. ఏప్రిల్ నెల ప్రారంభం కావడంతో గంపెడాశలతో పింఛన్ సొమ్ము కోసం వేచి చూస్తున్న పండుటాకులకు తీవ్ర నిరాశను మిగిల్చారు. పింఛన్ లబ్ధిదారులంతా సీఎం జగన్‌కు అండగా ఉంటారనే అక్కసుతో చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం మాపై పగబట్టారు. మేము పింఛన్ కోసం క్యూలో నిలబడి సొమ్మసిల్లి పడిపోవాలా అంటూ పింఛన్‌దారులు మండిపడుతున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ప్రయాసలు పడుతూ వెళ్లి ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్దకు వెళ్లి పడిగాపులు కాశారు.

నందవరం: మండలంలోని నందవరం సచివాలయం–1, సచివాలయం–2, గురజాల, నాగలదిన్నె గ్రామ సచివాలయాల వద్ద వందల కొద్దీ పింఛన్‌దారులు గంటల తరబడి ఎదరుచూపులు చూశారు మొత్తం 7,157 పింఛనుదారులుండగా రూ.2.11 కోట్లు నగదు మంజూరైంది. సచివాలయాల వద్ద నిరీక్షించలేక వృద్ధులు, వితంతువులు నానా అవస్థలు పడ్డారు.

ఆస్పరి: ఆస్పరిలో మధ్యాహనం పింఛన్లు పంపిణీ చేస్తున్నారని చెప్పడంతో సచివాలయాల వద్దకు లబ్ధిదారులు పరుగులు తీశారు. పింఛన్ డబ్బులు తీసుకునేందుకు బారులు తీరారు. మండలంలోని 33 గ్రామాల్లో 7318 మంది పింఛన్ దారులు ఉండగా బుధవారం 10 శాతం మందికి కూడా పింఛన్ సొమ్ము పంపిణీ చేయలేకపోయారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల వ్యాప్తంగా మధ్యాహ్నం తర్వాత పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. 18 సచివాలయాల పరిధిలో 8062 మందికిగాను రూ.2,40,36,500 పంపిణీ చేయాల్సి ఉండగా సాయంత్రం 7 గంటల సమయానికి 1217 మందికి రూ.36,83,000 (15 శాతం) పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు.

ఇంటివద్దనే పింఛన్ ఇవ్వాలి



నేను వికలాంగుడిని. ఈ నెల పింఛన్ కోసం ఆపసోపాలు పడి సచివాలయానికి వచ్చాను. ఎండలో ఎదురుచూసినా ఈ రోజు అందుతుందో లేదో ఎప్పుడిస్తారో తెలియదు. నాలాంటి వారు ఎందరో ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ ఆలస్యం అయితే మాలాంటి పేదలకు ఆర్థిక కష్టాలు పెరుగుతాయి. మాకు ఇంటి వద్ద పింఛన్ అందకుండా చేసిన వారికి పుట్టగతులు ఉండవు. –ముల్లా హుసేన్, దివ్యాంగ పింఛన్‌దారుడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి

పడిగాపులు పడాల్సిందే



వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పింఛన్ సొమ్ము కోసం ఏనాడూ పంచాయతీ గుమ్మానికి వెళ్లలేదు. ప్రతి నెలా 1వ తేది ఇంటి వద్దకే పింఛన్ నగదు వచ్చేది. చంద్రబాబు కుట్రతో ఇప్పుడిలా పింఛన్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. ఉదయం నుంచి మంచి నీళ్లు కూడా తాగకుండా ఇక్కడ వచ్చి కూర్చున్నాను. వచ్చే నెల వలంటీర్ల ద్వారానే పింఛన్ పంపిణీ చేయాలి. – మంగమ్మ, వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు, హులేబీడు,

పాత రోజుల్లోని కష్టాలు గుర్తుకొచ్చాయి



మాలాంటి వృద్ధులకు వలంటీర్ల ద్వారా అందిస్తున్న సేవలు మరువలేనివి. ప్రతి నెలా 1వ తేదీ వలంటీర్ వచ్చి రూ.3 వేలు పింఛన్ అందిచేవాడు. ఇప్పటినుంచి గ్రామ సచివాలయంలో పింఛన్ ఇస్తారని చెబితే ఉదయం 6 గంటలకే వచ్చి కూర్చున్నాను. ఇక్కడే గంటల తరబడి కూర్చోవాల్సిన పరిస్థితి. చాలా ఇబ్బందిగా ఉంది. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం పడిన కష్టాలు, ఆ పాత రోజులు గుర్తొస్తున్నాయి. – హుసేన్ బీ, వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు, హులేబీడు,

మా ఉసురు తగులుతుంది



మా ఇంటికీ దూరంగా ఉన్న సచివాలయానికి వెళ్లి పింఛన్ డబ్బులు తెచ్చుకోవాలని చెబుతున్నారు. వృద్ధాప్యంలో అంతదూరం వెళ్లలేని పరిస్థితి. గతంలో చంద్రబాబు పాలనలో ఎన్నో కష్టాలు పడి పంచాయతీ కార్యాలయం వద్ద గంటలతరబడి ఎదురుచూసి పింఛన్ డబ్బులు తీసుకునే వాళ్లం. ముఖ్యమంత్రి జగన్ వచ్చాక ఇంటి దగ్గరే పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు ఇంటి వద్దకు పింఛన్ రాకుండా చేసిన చంద్రబాబు మా ఉసురు తగిలి మట్టికొట్టుకుపోతాడు. – బజరమ్మ వృద్ధురాలు, గోనెగండ్ల

చాలా అన్యాయం



నెలనెలా ఇంటి వద్దకే పింఛన్ తెచ్చి ఇస్తుంటిరి. ఈ నెల వలంటీర్ మా ఇంటి వైపు రాలేదు. పింఛన్ ఆఫీసు వద్ద ఇస్తారంటే వచ్చినా.. ఎండలోనే ఎదురు చూసినట్టు ఉంది. పింఛన్‌లు ఇంటి వద్దకు తెచ్చి ఇవ్వకుండా అడ్డ పడటం చాలా అన్యాయం. – చాకలి లక్ష్మి, నందవరం

మాకు అన్యాయం చేస్తే ఏమొస్తాది



పింఛన్ తీసుకునే వృద్ధులు, వికలాంగులకు అన్యాయం చేస్తే చంద్రబాబుకు ఏమొస్తాది. ఇప్పుడు పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లి ఎంతసేపు ఉండాలనో. ఈ వయసులో మమ్మల్ని చంద్రబాబు అన్యాయంగా ఇబ్బంది పెడుతున్నాడు. ఎండాకాలంలో సచివాలయం వద్దకు వెళ్లి నిలబడి వారు పింఛన్ ఇచ్చేవరకు ఉండాలంటే ఎంత కష్టం. మమ్మల్ని ఇబ్బంది పెడుతున్న చంద్రబాబుకు గుణపాఠం చెబుతాం. – బగిలి చాంద్‌బీ, వృద్ధురాలు, గోనెగండ్ల

దివ్యాంగులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు



కంటి చూపు సరిగాలేని మాలాంటి వారిని చంద్రబాబునాయుడు ఇబ్బందులు పెట్టడం సరికాదు. ఈరోజు పింఛన్ ఇస్తారని చెప్పడంతో ఉదయమే వెళ్లి సచివాలయం దగ్గర రెండు గంటల వరకు కూర్చున్నాను. పింఛన్ రేపు పంపిణీ చేస్తారని చెప్పడంతో ఇంటికి తిరిగి వచ్చాను. పింఛన్ కోసం సచివాలయం దగ్గరకు వెళ్లాలంటే ఇంకొకరి సహాయం తీసుకోవాల్సి వచ్చింది. మాలాంటి వారిని ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. – హరికృష్ణ, శంకరబండ, ఆస్పరి మండలం

పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగం



మాలాంటి పేద వారికి పింఛన్ సొమ్ము ఎంతో ఉపయోగపడుతుంది. నాకు ఆరోగ్యం సరిగాలేదు. మందులు కొనుక్కునేందుకు డబ్బు అవసరం. అంతేగాకుండా పొదుపులో అప్పు తీసుకున్నాను. వాయిదా కట్టేందుకు పింఛన్ డబ్బులే ఆదారం. ఈసారి ఆలస్యం కావడంతో ఇబ్బందులు పడ్డాం. వచ్చే నెలలోనైనా 1వ తేదీనే పింఛన్ డబ్బులు ఇవ్వాలి. – పక్కీరమ్మ శంకరబండ, ఆస్పరి మండలం

ఇబ్బంది పడుతూ వచ్చా



ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్ తలుపు తట్టి పింఛన్ ఇచ్చి వెళ్లేవారు. ఇప్పుడు వాళ్లను పింఛన్ పంచొద్దు అన్నారట. సేవ చేసే వాళ్లని వద్దనడం దుర్మార్గం. మాలాంటి ముసలొల్లు పింఛన్ కోసం ఎక్కడికో రావాలంటే ఇబ్బందులు తప్పవు. – లక్ష్మి, క్రాంతినగర్, ఎమ్మిగనూరు

గ్రామ స్వరాజ్యమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



దేవనకొండలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీవై రామయ్య, విరూపాక్షి

దేవనకొండ: గ్రామ స్వరాజ్యమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని పార్టీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఓబులాపురం, జిల్లెడబుడకల, మాదాపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. 2024లో ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న ఎన్నికల పోరులో ధర్మంవైపే ప్రజలు ఉన్నారని, అఖండ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మీరు వేసే ఓటు అభివృద్ధికి బాటలు కావాలని, తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. మోసకారి చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– దేవనకొండలోని వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని బుధవారం కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ సురేందర్ రెడ్డి ప్రారంభించారు. విరుపాక్షి మాట్లాడుతూ.. జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఎన్ని దుష్టశక్తులు కలిసివచ్చినా జగనన్నను ఏమీ చేయలేవన్నారు. బీవై రామయ్య మాట్లాడుతూ.. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్ద పింఛన్ అందకుండా కుట్రలు పన్నిన చంద్రబాబుకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ, దివాకర్‌నాయుడు, కౌలుట్లయ్య, తపాల శ్రీనివాసులు, ప్రేమనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆలూరు రూరల్: వైఎస్సార్‌సీపీతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి అన్నారు. బుధవారం హాలహర్వి మండలం చింతకుంట గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు ఎంపీపీ నెట్టికంటమ్మ, భర్త పరశురాముడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి విరూపాక్షి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రశాంత పోలింగ్ నిర్వహణే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

ఎమ్మిగనూరుటౌన్: వచ్చే మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన సూచించారు. బుధవారం పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి అధికారులు, ఎంసీసీ బృందాలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ దఫా నియోజకవర్గంలో ఓటర్లలో చైతన్యం తెచ్చి 85 శాతంపైనే ఓటింగ్ నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. పోలింగ్ తక్కువగా నమోదయ్యే కేంద్రాలపై దృష్టి సారించి ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కు నమోదు చేసుకునే వారికి ఈ నెల 16వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఓటు నమోదు, తొలగింపు, తప్పులు సరిచేయడంపై అన్ని రకాల ఆధారాలు పోలింగ్ కేంద్రాల్లో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి హోమ్ ఓటింగ్ విధానాన్ని ఎన్నికల కమిషన్ అందుబాటులో తెచ్చిందని దీన్ని సద్వినియోగం చేసుకొనేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. ఎన్నికలకు రెండురోజుల ముందు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఇప్పటికే గుర్తించినందున అక్కడ ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు పంపే సామగ్రితో పాటు మార్క్‌డ్ కాపీలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈవీఎం మిషన్లపై అవగాహన కలిగివుండాలని, మాక్‌పోలింగ్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ అనంతరం ఈవీఎం మిషన్లను కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీకి తరలించడం జరుగుతుందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మంచి నీరు, విద్యుత్ సౌకర్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని, ఏవైనా లోపాలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది ఎన్నికల ముందు రోజు ఎవరి ఇళ్లకు వెళ్లి ఉండరాదన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై పట్టణంలో ఏర్పాటు చేయనున్న ఫ్లెక్సీని ఆవిష్కరించారు. నియోజకవర్గ ఎన్నికల ఆర్‌ఓ చిరంజీవి, డీఎస్పీ సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషారెడ్డి, పట్టణ రూరల్ సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డితో పాటు సెక్టోరల్ ఆఫీసర్లు, పీఓలు, ఏపీఓలు, అధికారులు పాల్గొన్నారు.


బాబువి సూపర్ ఫేక్ పథకాలు



ఎమ్మిగనూరులో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ప్రజలను ఇస్తామంటున్నవి సూపర్ ఫేక్ పథకాలని, ఆయన మాటలకు గ్యారెంటీ లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక అన్నారు. ఆమె బుధవారం పట్టణంలోని 25వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకులు పథకాలకు షూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ అంటూ మాయ మాటలు చెప్పి మళ్లీ మోసగించేందుకు వస్తున్నారు, వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. గతంలో ముఖ్యమంత్రి అయ్యాక మేనిఫెస్టోను మాయం చేసిన మోసకారి చంద్రబాబు అని, ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకు దక్కిందని వివరించారు. వార్డు ఇన్‌చార్జ్ శివన్న, నాయకులు బుట్టా శివనీలకంఠ, శ్రీనివాసులు, బుట్టా శారదమ్మ, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, అశోక్, బుట్టా రంగయ్య, కేశవరెడ్డి, పూజేశ్వరి, నరసింహులు, బజారి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకే శిలాఫలకం ధ్వంసం



ఎస్‌హెచ్ ఎర్రగుడి ఆర్బీకే శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

కృష్ణగిరి: ఎన్నికల సమయంలో కొందరు దుండగులు గ్రామాల్లో చిచ్చుపెట్టేలా ప్రవరిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఓర్వలేక ఇలా చేస్తున్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతోంది. మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతులమీదుగా ప్రారంభించిన ఆర్బీకే శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం విధులకు వచ్చిన వీఏఏ రామనందు ధ్వంసమైన శిలాఫలకాన్ని చూసి పైఅధికారులకు తెలియజేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. బుధవారం ఇదే గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరు గ్రామానికి వస్తున్న సమయంలోనే రాత్రికి రాత్రి శిలాఫలకం ధ్వంసం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఘటనపై విచారణ జరిపి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు.

చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలి



రత్నపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎన్నికలకు ముందే చంద్రబాబు కుట్రలు బయటపడుతున్నాయని, ప్రజా సంక్షేమాన్ని అడ్డుకుంటున్న టీడీపీ కూటమికి ఓటుతోనే బుద్ధిచెప్పాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. ఆమె బుధవారం వెల్దుర్తి మండల పరిధిలోని రత్నపల్లె, యాదరాళ్ల, పుల్లగుమ్మి గ్రామాల్లో తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ ముందుకుసాగారు. తమను గెలిపిస్తే రాబోవు రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రారంభించిన పథకాలను నాడు తుంగలో తొక్కిన చంద్రబాబు, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న పథకాలను సైతం నిర్వీర్యం చేసేలా కుట్రలు పన్నుతున్నాడన్నారు. దివ్యాంగులు, వృద్ధులపై కనికరం లేకుండా వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరం చేశారన్నారు. తనను ఎమ్మెల్యేగా, బీవై రామయ్యను ఎంపీగా తద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు మే 13న జరిగే ఎన్నికలలో రెండు ఓట్లు (ఎంపీ, ఎమ్మెల్యే) ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. ఆయా కార్యక్రమాలలో రత్నపల్లె రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివ, సర్పంచ్ ఫక్కీరమ్మ, మల్లికార్జున, సుధాకర్, పెద్దయ్య, రవి, శ్రీను, వెంకటరమమణ, యాదరాళ్ల కృష్ణ, లింగమూర్తి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: ఎన్నికల నియామవళిని అన్ని పార్టీల నాయకులు పాటించాలని ఆర్‌ఓ చిరంజీవి పేర్కొన్నారు. ఆయన బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని తూచతప్పక పాటించాలన్నారు. పింఛన్ల పంపిణీ ముగిసిన తరువాత మరోసారి బీఎల్వోలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా అసౌకర్యాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రచార వాహనాలకు, మైక్‌లకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, సువేదా యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లో అనుమతి మంజూరు చేస్తామన్నారు. ఆయా పార్టీల ప్రచారాల్లో ఉద్యోగులు, వలంటీర్లు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారు పాల్గొంటే చర్యలు తప్పవన్నారు. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడినా, ఏమైన ఫిర్యాదులు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబర్ 08512–297300 కు కాల్ చేయవచ్చని విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఎన్నికల డీటీ రఘువీరా, ఆయా పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.